# కల్యాణి పసిడి పరుగు



## తెలంగాణ జూనియర్ అథ్లెటిక్స్ టోర్నీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఉస్మానియా యూనివర్సిటీ(ఓయూ) వేదికగా జరుగుతున్న 10వ తెలంగాణ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర అథ్లెట్లు అద్భుత ప్రదర్శన కనబరిచారు. గురువారం మొదలైన టోర్నీలో బాలికల అండర్-20 800మీటర్ల రేసులో కల్యాణి 2:35:09సెకన్ల టైమింగ్‌తో పసిడి పతకంతో మెరిసింది. ఇదే విభాగంలో టబు(కొత్తగూడెం), పూజ(నిర్మల్) వరుసగా రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. బాలుర అండర్-18 లాంగ్‌జంప్‌లో నల్లగొండకు చెందిన సపావత్ దాతు 6.69మీటర్లు దూకి స్వర్ణం ఖాతాలో వేసుకున్నాడు. అశోక్(6.67మీ), సుబ్బు(6.13మీ) రజత, కాంస్య పతకాలు దక్కించుకున్నారు. తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్, సాట్స్ సంయుక్తంగా ఈ టోర్నీ నిర్వహిస్తున్నాయి.

# ఆదుకున్న అశ్విన్

సొంతగడ్డపై శతక గర్జన
హసన్ ధాటికి టాపార్డర్ కకావికలం
రాణించిన జడేజా, జైస్వాల్
భారత్, బంగ్లా తొలి టెస్టు


జడేజా (86*)


అశ్విన్ (102*)

6- టెస్టులలో అశ్విన్ శతకాలు. చెన్నైలో రెండోది. 2021లో ఇంగ్లండ్‌పై ఇదే వేదికలో సెంచరీ చేశాడు.

**చెన్నై వేదికగా భారత్, బంగ్లాదేశ్ తొలి టెస్టు పోరు రసవత్తరంగా సాగుతున్నది. టాస్ గెలిచిన బంగ్లా ఊహించని రీతిలో భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. కెప్టెన్ నమ్మకాన్ని వమ్ము చేయని హసన్..కెప్టెన్ రోహిత్‌శర్మ, శుభ్‌మన్‌గిల్, విరాట్ కోహ్లీని ఔట్ చేసి ఆదిలోనే కోలుకోలేని దెబ్బ కొట్టాడు. యశస్వి జైస్వాల్, పంత్ బ్యాటింగ్‌తో గాడిలో పడ్డ టీమ్‌ఇండియాను అశ్విన్, జడేజా ఒడ్డున పడేశారు. లోకల్ హీరో అశ్విన్..బంగ్లా బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ అజేయ సెంచరీతో చెలరేగితే జడేజా బ్యాటు ఝులిపించడంతో భారత్ 339 పరుగుల మార్క్ అందుకుంది. 144 పరుగులకే 6 వికెట్లు కోల్పోయిన భారత్ వీరిద్దరి బ్యాటింగ్‌తో పోరాడే స్కోరు అందుకుంది. శుక్రవారం ఇదే జోరు కొనసాగితే.. భారత్‌కు భారీ స్కోరు సాధ్యమైనట్లే.**

చెన్నై: స్వదేశంలో బంగ్లాదేశ్‌తో చెన్నైలోని చెపాక్ స్టేడియం వేదికగా జరుగుతున్న తొలి టెస్టులో 'లోకల్ బాయ్' రవిచంద్రన్ అశ్విన్ (112 బంతుల్లో 102 నాటౌట్, 10 ఫోర్లు, 2 సిక్సర్లు) శతక గర్జన చేసి భారత్‌ను ఆదుకున్నాడు. బంగ్లా యువ పేసర్ హసన్ మహ్మూద్ (4/58) ధాటికి కకావికలమైన భారత స్కోరు బోర్డును మరో స్పిన్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా (117 బంతుల్లో 86 నాటౌట్, 10 ఫోర్లు, 2 సిక్సర్లు)తో కలిసి పటిష్ట స్థితికి చేర్చాడు. టాపార్డర్ బ్యాటర్లు రోహిత్ శర్మ (6), విరాట్ కోహ్లీ (6), శుభ్‌మన్ గిల్ (0), కేఎల్ రాహుల్ (16) దారుణంగా విఫలమైన చోట చెపాక్ పిచ్‌పై సంపూర్ణ అవగాహన కలిగిన భారత స్పిన్ ద్వయం.. అజేయమైన ఏడో వికెట్‌కు 195 పరుగులు జోడించింది. అశ్విన్, జడ్డూ రాణించడంతో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 80 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 339 పరుగులు చేసింది.

### హసన్ ధాటికి విలవిల..

అందరూ ఊహించినట్టుగా చెపాక్‌లో స్పిన్నర్లు మాయ చేస్తారనుకుంటే అందుకు పూర్తి భిన్నంగా బంగ్లా పేసర్ హసన్ రోహిత్ సేనకు ఊహించని షాకిచ్చాడు. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు వచ్చిన టీమ్‌ఇండియాను ఆరంభ ఓవర్లలో అతడు ముప్పుతిప్పలు పెట్టాడు. తొలి సెషన్‌లో అతడి గణాంకాలే (5 ఓవర్లు 2 మెయిడిన్లు 6 పరుగులు 3 వికెట్లు) ఇందుకు నిదర్శనం. వ్యక్తిగత స్కోరు 1 వద్ద ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్న కెప్టెన్ రోహిత్.. హసన్ వేసిన ఇన్నింగ్స్ ఐదో ఓవర్లో బంగ్లా సారథి శాంతోకు క్యాచ్ ఇవ్వడంతో భారత వికెట్ల పతనం మొదలైంది. ఆ తర్వాత అతడు వరుస ఓవర్లలో.. గిల్, కోహ్లీనీ పెవిలియన్‌కు పంపించాడు. దీంతో భారత్ 34 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ క్రమంలో యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (118 బంతుల్లో 56, 9 ఫోర్లు), రిషభ్ పంత్ (52 బంతుల్లో 39, 6 ఫోర్లు)తో కలిసి భారత్‌ను ఆదుకునే యత్నం చేశాడు. నాలుగో వికెట్‌కు ఈ ఇద్దరూ 62 పరుగులు జోడించారు. టాపార్డర్ ఇబ్బందిపడ్డా ఈ ఇద్దరు మాత్రం సంయమనంతో ఆడుతూ స్కోరు బోర్డును ముందుకు నడిపించారు. లంచ్ సమయానికి భారత స్కోరు 88/3గా ఉంది. లంచ్ తర్వాత కొద్దిసేపటికే హసన్.. పంత్‌ను ఔట్ చేసి భారత్‌ను మరోసారి ఒత్తిడిలోకి నెట్టాడు. అర్ధ సెంచరీ తర్వాత జైస్వాల్.. నహీద్ రాణా బౌలింగ్‌లో షద్మాన్‌కు క్యాచ్ ఇవ్వగా రాహుల్‌ను మెహిది హసన్ మిరాజ్ బోల్తా కొట్టించడంతో భారత్ పీకల్లోతు కష్టాల్లో పడింది.

### ఆదుకున్న 'లోకల్ బాయ్స్'

అత్యంత కఠిన పరిస్థితుల్లో క్రీజులోకి వచ్చిన అశ్విన్, జడేజా ఆరంభంలో కొద్దిసేపు ఆచితూచి ఆడారు. చెన్నైలోనే పుట్టి పెరిగి చిదంబరం పిచ్ స్వభావంపై పూర్తి అవగాహన ఉన్న అశ్విన్, దశాబ్దికి పైగా ఇక్కడ ఐపీఎల్ ఆడుతున్న (సీఎస్కేకు) జడ్డూ క్రీజులో కుదురుకునేదాకా ఓపిక పట్టారు. జడ్డూ నెమ్మదిగా ఆడినా అశ్విన్ వన్డే తరహా ఆట ఆడుతూ స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. టాపార్డర్‌ను ఇబ్బందిపెట్టిన హసన్, నహీద్‌తో పాటు స్పిన్నర్లు షకిబ్, మిరాజ్, తైజుల్‌ను భారత స్పిన్ ద్వయం సమర్థవంతంగా ఎదుర్కొంది. టీ విరామానికి క్రీజులో కుదురుకున్న అశ్విన్.. ఆ తర్వాత వేగం పెంచాడు. షకిబ్ 53వ ఓవర్లో స్లాగ్ స్వీప్‌తో సిక్సర్ అయితే చూసి తీరాల్సిందే. 58 బంతుల్లో అశ్విన్ అర్ధ సెంచరీ పూర్తవగా జడేజా 73 బంతుల్లో దానిని పూర్తిచేశాడు. ఆఖరి సెషన్‌లో ఈ ఇద్దరూ మరింత దూకుడు పెంచారు. మిరాజ్ 73వ ఓవర్లో కవర్స్ మీదుగా సిక్సర్ బాదిన అశ్విన్.. 90ల లోకి చేరాడు. షకిబ్ 78వ ఓవర్లో మూడో బంతికి సింగిల్ తీసి టెస్టుల్లో ఆరో శతకాన్ని పూర్తిచేశాడు. ఒక దశలో 144/6గా ఉన్న భారత స్కోరు.. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 339/6కు చేరిందంటే అది ఈ ఇద్దరి చలవే. అశ్విన్, జడ్డూ క్రీజులో ఉండటంతో రెండో రోజు భారత్ 400 ప్లస్ స్కోరుపై కన్నేసింది.

### సంక్షిప్త స్కోర్లు

**భారత్:** 80 ఓవర్లలో 339/6 (అశ్విన్ 102 నాటౌట్, జడేజా 86 నాటౌట్, జైస్వాల్ 56, హసన్ మహ్మూద్ 4/58)



## దీటుగా బదులిస్తున్న కివీస్

గాలె: శ్రీలంకతో గాలే వేదికగా జరుగుతున్న మొదటి టెస్టులో పర్యాటక న్యూజిలాండ్ దీటుగా బదులిస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో లంకేయులను 305 పరుగులకు ఆలౌట్ చేసిన కివీస్.. రెండో రోజు బ్యాటింగ్‌లోనూ అదరగొట్టింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆ జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 72 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 255 పరుగులు చేసింది. ఓపెనర్ టామ్ లాథమ్ (70), కేన్ విలియమ్సన్ (55) అర్ధ సెంచరీలతో మెరిశారు. డారెల్ మిచెల్ (41 నాటౌట్), టామ్ బ్లండెల్ (18) క్రీజులో ఉన్నారు. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో కివీస్ ఇంకా 50 పరుగులు వెనుకబడి ఉంది.


## అజయ్‌బాబుకు స్వర్ణం

సువా(ఫిజీ): కామన్వెల్త్ చాంపియన్‌షిప్‌లో భారత యువ వెయిట్‌లిఫ్టర్ వల్లూరి అజయ్‌బాబు స్వర్ణ పతకంతో మెరిశాడు. గురువారం జరిగిన పురుషుల 81కిలోల విభాగంలో బరిలో దిగిన అజయ్‌బాబు 326కి (147కి+179కి) బరువెత్తి అగ్రస్థానంలో నిలిచాడు. తద్వారా జూనియర్ విభాగంలో ఈ 19 ఏండ్ల యువ లిఫ్టర్ సరికొత్త రికార్డు తన పేరిట లిఖించుకున్నాడు. ఇదే కేటగిరీలో పోటీపడ్డ సాయిరాజ్ పర్దేశి రజతం సొంతం చేసుకున్నాడు.

## శశావత్ శతకం

అనంతపూర్: దులీప్ ట్రోఫీ చివరి దశ మ్యాచ్‌లలో భాగంగా గురువారం మొదలైన ఇండియా 'ఏ' వర్సెస్ ఇండియా 'సీ' మ్యాచ్‌లో.. 'ఏ' జట్టు మిడిలార్డర్ బ్యాటర్ శశావత్ రావత్ సెంచరీ (122 బ్యాటింగ్)తో మెరిశాడు. అతడికి అండగా ములానీ (44) రాణించడంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి 'ఏ' 224/7 పరుగులు స్కోరు చేసింది. ఇండియా 'బీ' వర్సెస్ 'డీ' మ్యాచ్ విషయానికొస్తే మొదట బ్యాటింగ్ చేస్తున్న 'డీ' జట్టు.. 77 ఓవర్లలో 306/5 పరుగులు చేసిం ది. సంజూ శాంసన్ (89 బ్యాటింగ్) శతకం దిశగా సాగుతుండగా పడిక్కల్ (50), కేఎస్ భరత్ (52), రికీ భుయ్ (56) అర్ధసెంచరీలు చేశారు.

# క్వార్టర్స్‌కు మాళవిక



చెంగ్డూ: చైనా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత యువ షట్లర్ మాళవిక బన్సోద్ క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో మాళవిక.. 21-17, 19-21, 21-16తో క్రిస్టీ గిల్మోర్ (స్కాట్లాండ్)ను ఓడించి క్వార్టర్స్‌కు అర్హత సాధించింది. తొలి రౌండ్‌లోనే ప్రపంచ ఏడో ర్యాంకర్ మరిస్కను చిత్తుచేసిన మాళవిక.. తాజాగా 25వ ర్యాంకర్‌నూ మట్టికరిపించింది. కాగా బ్యాడ్మింటన్ సూపర్ 1000 టోర్నీలో క్వార్టర్స్ చేరడం మాళవిక కెరీర్‌లో ఇదే ప్రథమం కావడం విశేషం. క్వార్టర్స్‌లో ఆమె జపాన్ షట్లర్ యమాగుచితో తలపడనుంది.

# సీఎం కప్ సన్నాహాలు

## క్రీడా సంఘాలతో సాట్స్ చైర్మన్ సమావేశం



హైదరాబాద్, ఆట ప్రతినిధి: సీఎం కప్-2024 కోసం రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (సాట్స్) సన్నాహాలు మొదలుపెట్టింది. త్వరలో నిర్వహించబోయే టోర్నీ కోసం క్రీడా సంఘాల ప్రతినిధులతో సాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి గురువారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. టోర్నీ విజయవంతం కోసం క్రీడా సంఘాల సహకారం అవసరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'గ్రామీణ యువ క్రీడా ప్రతిభను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో సీఎం కప్ నిర్వహిస్తున్నాం. మొత్తం నాలుగు అంచెల్లో(గ్రామీణ, మండల, జిల్లా, రాష్ట్ర) పోటీలు నిర్వహిస్తాం. ఇందుకోసం సాంకేతికంగా, నిర్వహణ పరంగా క్రీడా సంఘాల మద్దతు అవసరం. టోర్నీలో పారా క్రీడాంశాలకు కూడా తగిన ప్రాధాన్యమిస్తాం' అని అన్నారు. ఈ కార్యక్రమంలో సాట్స్ ఎండీ సోనీబాలదేవి, డీడీలు చంద్రారెడ్డి, రవీందర్, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# 89 ఏండ్ల రికార్డు బద్దలు



టీమ్‌ఇండియా యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ 89 ఏండ్ల టెస్టు రికార్డును తిరుగరాశాడు. సుదీర్ఘ టెస్టు క్రికెట్ చరిత్రలో తొలి 10 ఇన్నింగ్స్‌లో 750 పరుగులకు పైగా సాధించిన తొలి బ్యాటర్ జైస్వాల్ అరుదైన రికార్డు సొంతం చేసుకున్నాడు. 2023లో వెస్టిండీస్‌పై అరంగేట్రం చేసిన జైస్వాల్ కొత్త రికార్డుల వేటలో దూసుకెళుతున్నాడు. బంగ్లాదేశ్‌తో తొలి టెస్టులో అర్ధ సెంచరీ ద్వారా 1935లో వెస్టిండీస్ బ్యాటర్ జార్జ్ హెడ్లీ(747 పరుగులు) నెలకొల్పిన రికార్డును జైస్వాల్ బద్దలు కొట్టాడు. బంగ్లాతో మ్యాచ్‌కు ముందు 9 ఇన్నింగ్స్‌లో 712 పరుగులతో ఉన్న ఈ యువ క్రికెటర్ అర్ధసెంచరీతో ఈ ఫీట్ అందుకున్నాడు.

## కోహ్లీ లెఫ్ట్‌హ్యాండ్ బ్యాటర్!




భారత్, బంగ్లాదేశ్ టెస్టు మ్యాచ్ ప్రసారం చేస్తున్న స్పోర్ట్స్-18లో పప్పులో కాలేసింది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీని లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ అంటూ పేర్కొంటూ ప్రసారం చేసింది.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.